అన్నివర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం

హుస్నాబాద్‌లో బతుకమ్మ చీరల పంపిణీలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

- రాష్ట్రంలో ఏటా కోటి మంది మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ
- అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తాం, వెంటనే విధుల్లో చేరండి
- రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్

హుస్నాబాద్, అక్టోబర్ 4: రాష్ట్రంలో ఏటా కోటి మందికిపైగా మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. బుధవారం హుస్నాబాద్‌లోని శ్రీసిద్ధార్థ హైస్కూల్ ఆవరణలో మున్సిపల్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. పలువురు మహిళలకు స్వయంగా చీరలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సంవత్సరం బతుకమ్మ చీరలకు ప్రభుత్వం రూ.500కోట్లు కేటాయించిందన్నారు. ఆడబిడ్డలకు తండ్రిగా, అన్నగా సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నారని చెప్పారు. బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించిన ఘనత కూడా ఆయనదేనన్నారు. తెలంగాణ ఉద్యమంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని గుర్తించిన సీఎం కేసీఆర్ తెలంగాణ వచ్చాక మహిళలకు సముచితస్థానం కల్పిస్తున్నారని, అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. బ్యాంకు రుణాలు, లింకేజీల ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. ఏ రాష్ట్రంలోనూ మహిళలకు ఇంత ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. రంజాన్, క్రిస్మస్ పండుగలకు కూడా దుస్తులు పంపిణీ చేస్తున్నారన్నారు. బతుకమ్మ చీరల తయారీతో నేతన్నల జీవన ప్రమాణాలు కూడా పెరుగుతున్నాయన్నారు. ఈ సంవత్సరం ఆడబిడ్డలకు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ, దసరా పేడుకలు జరుపుకోవాలన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, వారు వెంటనే విధుల్లో చేరాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, ఎంపీపీ మాలోత్ లక్ష్మి, జడ్పీటీసీ భూక్యా మంగ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజనీతిరుపతిరెడ్డి, మున్సిల్ కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు కొంకటి నళినీదేవి, బొల్లి కల్పన, పెరుక భాగ్యరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

పేదపిల్లల ఆకలి తీర్చేందుకే అల్పాహార పథకం

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ

- రైతు కేంద్రంగా అనేక పథకాలు ప్రభుత్వం తీసుకొచ్చింది..
- ఆరోగ్య మహిళా కార్యక్రమం మహిళలకు వరం
- రైతులు ఆయిల్‌పామ్ సాగువైపు దృష్టి సారించాలి
- జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ
- జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 4 : పేద పిల్లల ఆకలి తీర్చేందుకే సీఎం కేసీఆర్ అల్పాహార పథకాన్ని ప్రవేశ పెట్టారని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. బుధవారం సిద్దిపేటలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో ఆమె అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ముందుగా వ్యవసాయరంగంలో విశేష కృషిచేసిన ఎంఎస్ స్వామినాథన్ మృతికి సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పలు అంశాలపై సభలో చర్చించారు. వ్యవసాయం, విద్యాశాఖ, ఉద్యానవన శాఖ, వైద్యారోగ్యశాఖ, జిల్లా పంచాయతీ విభాగం, జిల్లా సంక్షేమశాఖ తదితర శాఖల ప్రగతిని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి, కొత్త వంగడాలు తీసుకువచ్చి ప్రపంచంలోనే దేశానికి గుర్తింపు తెచ్చిన స్వామినాథన్ మృతిచెందడం వ్యవసాయ రంగానికి తీరని లోటన్నారు. రైతులు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో నంగునూరు మండలం నర్మెట గ్రామంలో పామాయిల్ కర్మాగారానికి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు ఆయిల్‌పామ్ రైతులకు శిక్షణా తరగతులు త్వరగా ప్రారంభించాలన్నారు. విద్యార్థులకు మంచి విజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం కృషిచేస్తున్నదని, ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి టూరిజం అవార్డుకు చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామం ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో టూరిజం హబ్‌గా రంగనాయకసాగర్ మరింత అభివృద్ధి చెందుతునుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేసే విషయంపై కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదన్నారు.

ధాన్యం తరుగు తీయడంపై సభ్యుల ఆగ్రహం

ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తుంది. కానీ, కొంతమంది మిల్లర్లు, అధికారుల అండదండలతో ధాన్యం తూకంలో తేడాలు వస్తున్నాయని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సివిల్ సప్లై అధికారి హరీశ్‌ను ప్రశ్నించారు. కొంత మంది మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నారని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దనే రైతులకు రసీదు ఇవ్వాలని, ఇష్టారీతిన మిల్లర్లు ధాన్యం తరుగు తీయడాన్ని అడ్డుకోవాలని కోరారు. రైతులను మోసం చేసే మిల్లర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని సివిల్ సప్లై అధికారి హరీశ్ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా

కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

- అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు
- దేశానికే ఆదర్శంగా రాష్ట్రాభివృద్ధి
- బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం
- బీఆర్ఎస్ యూత్‌వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

ములుగు, అక్టోబర్ 4: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉన్నదని బీఆర్ఎస్ యూత్‌వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా అన్నారు. మండలంలోని కొత్తూరుకు చెందిన 30 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీ కార్యకర్తలు బుధవారం జుబేర్‌పాషా ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోక గ్రామాలు చీకట్లో మగ్గిపోయాయని, 10 ఏండ్ల సీఎం కేసీఆర్ పాలనతో గ్రామాలు అభివృద్ధి చెంది, ప్రగతిపథంలో దూసుకుపోతున్నాయన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కాం గ్రెస్, బీజేపీ నాయకులు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో కేసీఆర్ లక్ష ఓట్ల మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సొంతం చేసుకోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ముదిరాజులు మురిసేలా..

- రాష్ట్రంలోనే తొలి మోడల్ ముదిరాజ్ ఫంక్షన్‌హాల్
- రూ.7 కోట్లతో సకల హంగులతో నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 4: ముదిరాజు కులస్తులు మురిసేలా మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేట శివారులో రూ.7 కోట్లతో కన్వెన్షన్ హాల్‌ను తలపించేలా ఫంక్షన్‌హాల్‌ను నిర్మించారు. రాష్ట్రంలోనే తొలి ఏసీ ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌ను సిద్దిపేటలో నిర్మించగా, నేడు మంత్రి హరీశ్‌రావు ముదిరాజ్ ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించనున్నారు. మంత్రి హరీశ్‌రావు ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దదేవాలయాలను రూ.30 లక్షల చొప్పున సిద్దిపేట, నంగునూరులో అభివృద్ధి చేశారు. రూ.10రలక్షల చొప్పున దాదాపు 15 ఆలయాలు అభివృద్ధి చేశారు. వీటితోపాటు రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా రూ.6కోట్లతో భవనం, కోటి రూపాయలతో ఇతర సౌకర్యాలు కల్పించారు. ఇంత మంచి నిర్మాణం చేసినందుకు ముదిరాజ్ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి హరీశ్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ముదిరాజ్ ఫంక్షన్ హాల్

తుది ఓటరు జాబితా విడుదల

- జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 9,25,398
- మహిళా ఓటర్లు 4,68,140, పురుష ఓటర్లు 4,57,178

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 4 : జిల్లాలోని తుది ఓటరు జాబితాను ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 9,25,398 మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళా ఓటర్లు 4,68,140 మంది ఉండగా, పురుష ఓటర్లు 4,57,178 మంది ఉన్నారు. జిల్లాలోని హుస్నాబాద్ (32) నియోజకవర్గంలో 2,36,575 మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళలు 1,19,406 మంది ఉండగా, పురుషులు 1,17,165 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. సిద్దిపేట(33) నియోజకవర్గంలో మొత్తం 2,28,523 మంది ఓటర్లు ఉండగా, మహిళలు 1,15,520 మంది ఉండగా, పురుషులు 1,12,934 మంది, ఇతరులు 69 మంది ఉన్నారు. దుబ్బాక (41) నియోజకవర్గంలో మొత్తం 1,94,664 మంది ఓటర్లు ఉండగా, మహిళలు 99,359 మంది ఉండగా, పురుషులు 95,305 మంది ఉన్నారు. గజ్వేల్ (42) నియోజకవర్గంలో మొత్తం 2,65,636 మంది ఉండగా, ఇందులో మహిళలు 1,33,855 మంది ఉండగా, పురుషులు 1,31,774 మంది ఉండగా, ఇతరులు 7 మంది ఉన్నారు. జిల్లాలో 19 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉండగా, 451 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-310380

★ Wanted Civil Engineer (Narayankhed Project) Mechanical Engineer (Sadsivpet, Factory) Mobile: 9346349908. Mail: expeeengineeringhr@gmail.com
NT-318387